అంతర్గత రోడ్లకు మోక్షం


నల్లగండ్ల హుడా కాలనీలో వేసిన సీసీ రోడ్డు

- దశలవారీగా అన్ని అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా మార్చడమే లక్ష్యం
- సర్కిల్ పరిధిలో సుమారు రూ.20 కోట్లతో సీసీరోడ్లు

శేరిలింగంపల్లి: జీహెచ్ఎంసీ పరిధిలోని శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా మార్చేందుకు చర్యలు చేపట్టారు. సర్కిల్‌లోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, భారతీనగర్ డివిజన్లలోని కాలనీలు, బస్తీల్లో అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా మార్చే పనులను ప్రారంభించారు. ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు షేక్ హమీద్‌పటేల్, గంగాధర్‌రెడ్డి, రాగం నాగేందర్ యాదవ్, సింధు ఆదర్శ్‌రెడ్డి పర్యవేక్షణలో జీహెచ్ఎంసీ అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టడంతో సీసీ రోడ్ల పనులు చురుకుగా సాగుతున్నాయి. ఇప్పటికే పలు సీసీరోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే, కార్పొరేటర్లు అధికారుల సమక్షంలో శంకుస్థాపనలు చేయగా అందులో కొన్నింటిని నిర్మాణం ఇప్పటికే పూర్తయ్యాయి. మరికొన్ని పనులు సాగుతుండగా, ఇంకా పనులు సాగించాల్సినవి కూడా ఉన్నాయి.

గచ్చిబౌలిలో అత్యధికంగా సీసీ రోడ్ల నిర్మాణం..

- శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో 2023 జనవరి నుంచి ఇప్పటి వరకు మొత్తం 56 సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.20.65 కోట్ల విలువ చేసే పనులను చేపట్టారు.
- అందులో అత్యధికంగా గచ్చిబౌలి డివిజన్‌లో 20 సీసీ రోడ్లు చేపట్టగా వాటి విలువ రూ.688.00 లక్షలు కాగా, ఆ తర్వాత అతి తక్కువగా భారతీనగర్ డివిజన్‌లో నాలుగు సీసీరోడ్లకు రూ.103.00 లక్షల పనులను చేపట్టారు.

ఇప్పటి వరకు చేపట్టిన సీసీరోడ్ల వివరాలు..

డివిజన్	చేపట్టిన రోడ్లు	మొత్తం విలువ
కొండాపూర్	17	రూ.643.00 లక్షలు
గచ్చిబౌలి	20	రూ.688.00 లక్షలు
శేరిలింగంపల్లి	15	రూ.631.50 లక్షలు
భారతినగర్	04	రూ.103.00 లక్షలు

ఇంకా చేపట్టాల్సినవి..

- ఖాజాగూడలోని పీజేఆర్‌నగర్, రాయదుర్గం, గౌలిదొడ్డి, కేశవనగర్, ఖాజాగూడ, సాయిఐశ్వర్యకాలనీ, సాయివైభవ్‌కాలనీ, మధురానగర్, ప్రశాంత్‌హిల్స్ వంటి ప్రాంతాల్లో మరిన్ని చోట్ల చేపట్టాల్సిన అవసరం ఉంది.
- ఈ ప్రాంతాల్లో ప్రధాన రోడ్లను విస్తరించడం, లింకురోడ్ల నిర్మాణంతో అవి కాస్తా ఆకర్షణీయంగా మారగా, వాటికి చేరువలోని బస్తీల్లో అంతర్గత రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారిపోయింది.
- కొన్ని చోట్ల సీసీ రోడ్లు వేసినా వాటిపై మ్యాన్‌హోళ్లు పొంగి మురుగునీరు సీసీరోడ్లపై పారుతున్నవి కూడా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

అంతర్గత రోడ్లను సీసీ రోడ్లుగా మారుస్తాం..



శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీల్లో అంతర్గత రోడ్లను సీసీ రోడ్లుగా మార్చే ప్రక్రియ సాగుతోంది. 2023 జనవరి నుంచే రూ.2065.50 లక్షలతో 56 సీసీరోడ్ల నిర్మాణం చేపడుతున్నాం. ఇప్పటికీ ఇంకా కొన్ని చోట్ల నిర్మాణం చేయాల్సి ఉంది. వాటన్నింటికీ ప్రతిపాదనలు చేస్తున్నాం. నిధుల మంజూరును బట్టి సీసీరోడ్ల నిర్మాణం చేస్తాం. ప్రజలకు తమ పరిధిలో అంతర్గత రోడ్లని సీసీరోడ్లుగా మార్చేందుకు చర్యలు చేపట్టి వారికి ఇబ్బందులు లేకుండా చేస్తాం.

–శ్రీనివాస్, ఈఈ, శేరిలింగంపల్లి సర్కిల్

అన్ని అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా మార్చాలి..



అన్ని కాలనీలు, బస్తీల్లోని అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా మార్చాలి. అంతేకాకుండా సీసీరోడ్ల నిర్మాణం చేసిన తర్వాత వాటిపై ఉండే మ్యాన్‌హోళ్ల ద్వారా మురుగు నీరు రోడ్లపై పారకుండా చర్యలు చేపట్టాలి. రోజూ వీటిపై శుభ్రం చేసేలా కూడా చర్యలు తీసుకోవాలి. అంతర్గత రోడ్లు బాగుంటేనే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ రోడ్లపై వీధిదీపాలు కూడా వెలిగేలా చర్యలు చేపట్టాలి.

– రామస్వామియాదవ్, కన్వీనర్, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్

కనుల పండువగా కల్యాణోత్సవం


కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

మణికొండ: నార్సింగిలోని మల్లికార్జున దేవాలయంలో ఆదివారం మహారుద్ర యాగసహిత పార్వతి పరమేశ్వర కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, గోపూజ, మండపారాధన, రుద్ర పారాయణం, రుద్రాభిషేకం, మహారుద్రాయాగం, పూర్ణాహుతి, పార్వతీపరమేశ్వర కల్యాణ మహోత్సవం, పుష్పార్చన, మహాహారతి, మంత్రపుష్పం, ఆశీర్వచనం తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కల్యాణ మహోత్సవానికి హాజరయ్యే భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు తగు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో నార్సింగితో పాటు చుట్టూ పక్కల ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

హెచ్‌సీయూ క్యాంపస్‌లో ‘ఆజాదీ ర్యాలీ’



కాగడాలతో ఆజాదీ ర్యాలీ నిర్వహించిన దృశ్యం

రాయదుర్గం: దేశంలో అమలు చేస్తున్న విద్యను, రాజ్యాంగాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ ‘ఆజాదీ ర్యాలీ’ని నిర్వహించారు. స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఎఫ్ఐ) హెచ్‌సీయూ శాఖ ఆధ్వర్యంలో శనివారం రాత్రి క్యాంపస్‌లో కాగడాలతో ర్యాలీని నిర్వహించారు. హెచ్‌సీయూలోని ఎల్‌హెచ్–10 హాస్టల్ నుంచి సౌత్ షాపింగ్ కాంప్లెక్స్ వరకు కాగడాలతో ఈ ర్యాలీ కొనసాగించారు. భారతదేశంలో రాజ్యాంగాన్ని, విద్యావ్యవస్థను, భారత దేశాన్ని కూడా కాపాడాలని డిమాండ్ చేస్తూ ఈ ర్యాలీ కొనసాగించారు. అనంతరం భారతదేశాన్ని, రాజ్యాంగాన్ని, విద్యా వ్యవస్థను కాపాడాలని కోరుతూ గీతాలను కూడా ఆలపించారు. ఎస్ఎఫ్ఐ హెచ్‌సీయూ విభాగం కార్యదర్శి మోహిత్, అధ్యక్షుడు సోహెల్, యూనియన్ ప్రధాన కార్యదర్శి క్రిప, సీఈసీ సభ్యుడు శివ పాల్గొన్నారు.

గచ్చిబౌలి–కొండాపూర్ రోడ్డులో రాకపోకలు షురూ

గచ్చిబౌలి: గచ్చిబౌలి–కొండాపూర్ రోడ్డులో రెండు వైపులా వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రాడిసన్ హోటల్ వరకు లెవల్–2 ఫ్లై ఓవర్ నిర్మాణంలో భాగంగా కొద్ది నెలల క్రితం గచ్చిబౌలి జంక్షన్ నుంచి కొండాపూర్‌కు వెళ్లే మార్గాన్ని ట్రాఫిక్ పోలీసులు మూసి వేసిన విషయం తెలిసిందే. ఫ్లై ఓవర్ పిల్లర్ల నిర్మాణం వేగంగా చేపట్టడంతో కొద్ది రోజుల క్రితం సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ హర్షవర్థన్ గచ్చిబౌలి జంక్షన్ నుంచి కొండాపూర్ వైపు వాహనాల రాకపోకలకు అనుమతించారు. తాజాగా కొండాపూర్ నుంచి వాహనాలను గచ్చిబౌలి జంక్షన్‌కు అనుమతించినట్లు గచ్చిబౌలి ట్రాఫిక్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.



ఫ్రీ లెఫ్ట్‌లో ప్యాచ్ వర్క్

గచ్చిబౌలి: నిత్యం వాహనాల రద్దీతో జంక్షన్లు జామ్ అవుతున్నాయి. ప్రధాన కూడళ్లలో గుంతలు ఉండటంతో ఫ్రీ లెఫ్ట్‌లో వాహనాల రాకపోకలు సాఫీగా సాగడం లేదు. దీంతో రోడ్ల మరమ్మతులకు ట్రాఫిక్ పోలీసులు నడుబిగించారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని విప్రో జంక్షన్‌లో గుంతలు ఉండటంతో ఫ్రీ లెఫ్ట్‌లో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీసులు చొరవ తీసుకొని గుంతల్లో కాంక్రీట్‌తో ప్యాచ్‌వర్క్ చేశారు. గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్ ఎదురుగా రాంకీ రోడ్డుకు వెళ్లాలంటే గుంతలు ఎక్కువగా ఉండటంతో రాకపోకలు అంతరాయం కలుగుతోంది. గుంతలు ఉన్న చోట బీటీ నిర్మాణం కోసం ఇప్పటికే మెటల్ వేశారు. బీటీ పనులు పూర్తయితే ఫ్రీ లెఫ్ట్‌లో వాహనాలు సాఫీగా వెళ్లేందుకు వీలుంటుంది.


విప్రో జంక్షన్‌లో కాంక్రీట్‌తో గుంతలు పూడ్చిన దృశ్యం


రాడిసన్ హోటల్ ముందు బీటీ రోడ్డు నిర్మాణంలో భాగంగా మెటల్ వేసిన దృశ్యం

నేడు ప్రేమావతిపేటలో మేరీ మాటీ మేరా దేశ్

రాజేంద్రనగర్: ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా మేరీ మాటీ మేరా దేశ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.సత్యనారాయణ ముదిరాజ్ వెల్లడించారు. ప్రేమావతిపేట భవానీ కాలనీలో సోమవారం ఉదయం 9 గంటలకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అలాగే దేశం కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన స్వర్గీయ మేజర్ ఏ.పి.వినయ్‌కు నివాళి అర్పించి వారి కుటుంబాన్ని సన్మానించడం జరుగుతుందని తెలిపారు.

చిత్రకళలో సత్తా


సర్టిఫికెట్ అందిస్తున్న కవితదర్యానిరావు

అత్తాపూర్: పట్టుదల, క్రమ శిక్షణతో ఉంటే అనుకున్న లక్ష్యాలను సులభంగా సాధించవచ్చని షిండే ఆర్ట్స్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ టీచర్స్ హర్షవర్ధన్ షిండే, శేఖర్‌షిండే వెల్లడించారు. 21వ అంతర్జాతీయ చైల్డ్ ఆర్ట్స్ ఎగ్జిబిషన్ టోరస్ పోలాండ్‌లో ఆల్వేస్ గ్రీన్ అండ్ ఆల్వేస్ బ్లూ చిత్రకళ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో షిండే ఆర్ట్స్ ఎడ్యుకేషన్ నుంచి టి.సాయిస్మరన్‌కు బహుమతి వచ్చింది. జేఎన్ఏఎఫ్ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ కవితదర్యానిరావు, డాక్టర్ బి.ఏ.రెడ్డిల చేతుల మీదుగా అందుకున్నారు. ఈ పోటీల్లో 37 దేశాల నుంచి 7662 మంది విద్యార్థులు పాల్గొన్నారు. భారతదేశం నుంచి ఇద్దరికి మాత్రమే బహుమతులు వచ్చాయన్నారు. ఇందులో ఒకటి హైదరాబాద్ నుంచి షిండే ఆర్ట్స్ ఎడ్యుకేషన్ నుంచి టి.సాయిస్మరన్‌కు దక్కిందన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసరాల పంపిణీ


పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు, దేవర వంశీ

గోల్కొండ: దివంగత కార్పొరేటర్ దేవర కరుణాకర్ పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. గుడిమల్కాపూర్ దివంగత కార్పొరేటర్ దేవర కరుణాకర్‌కు ఆదివారం గుడిమల్కాపూర్‌లో నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు దేవర వంశీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసరాలు, దుస్తులు పంపిణీ చేశారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జీవితాంతం బీజేపీ కోసమే పని చేసిన దేవర కరుణాకర్ వేలాది మంది యువతకు మార్గనిర్దేశం చేశారన్నారు. బీజేపీ నాయకులు దేవర వంశీ, ప్రభు పూజారీ, అశ్విన్ తదితరులున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


ప్రజా సమస్యలు వింటున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారానికి మజ్లిస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన కార్వాన్ నియోజకవర్గంలోని నానల్‌నగర్, కార్వాన్, టోలిచౌకిలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా ప్రాంతాల వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ పార్టీకి అన్ని వర్గాల ప్రజల మద్దతు ఉందని అందువల్లే తమ పార్టీకి సెక్యూలర్ పార్టీగా ప్రజలు ముద్రవేశారన్నారు. మజ్లిస్ పార్టీ నేడు ఇతర రాష్ట్రాల్లో కూడా విస్తరించిందని ఆయా రాష్ట్రాల స్థానిక సంస్థలతో పాటు శాసన సభలో కూడా మజ్లిస్ ప్రాతినిత్యం వహిస్తుందని ఆయన గుర్తుచేశారు. ఎప్పుడు ఎక్కడ సమస్య తలెత్తిన తాను వెంటనే అక్కడ హాజరై సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులున్నారు.

ఉత్సాహంగా.. హర్ ఘర్ తిరంగా


బీజేపీ కార్యాలయంలో జాతీయ జెండాలతో కార్పొరేటర్

రాజేంద్రనగర్: భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపుమేరకు స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆదివారం డివిజన్ పరిధిలో ఇంటింటికి వెళ్లి జాతీయ జెండాను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రజలు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయాలన్నారు. దేశానికి మనకు ఉన్న మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేయడానికి ఎంతో దోహదం కానుందన్నారు. ఈ కార్యక్రమాల్లో పోస్టు ఆఫీసు సిబ్బంది అధికారులు కూడా భాగస్వామ్యం కావడం చాలా సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో పోస్టు ఆఫీసర్ కాటేదాన్ ఎస్ఓపీ బుచ్చన్న, పోస్టు మాస్టర్ టి.శివకుమార్, జె.జబ్బిల్లి, ఏ.ప్రత్యూష, ఆర్.శివ, గణేష్, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జెండాను ఎగరేయాలి..

రాజేంద్రనగర్: స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరు తమ ఇళ్లపై జాతీయ జెండాలను ఎగరవేయాలని రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ వెల్లడించారు. రాజేంద్రనగర్ బీజేపీ అధ్యక్షుడు జి.బాబురావు ఆధ్వర్యంలో పోస్టు ఆఫీస్ నుంచి కొనుగోలు చేసిన మువ్వెన్నెల జెండాలను రాజేంద్రనగర్‌లో ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 15వ తేదీన ప్రతి ఒక్కరు తమ ఇంటిపై జాతీయ జెండాలను ఎగరవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, ఈద్దవ్, వేణుగోపాల్, స్వామి, పెంటయ్య, భాస్కర్, శ్రీధర్, యాదవ్, అరుణ్, లక్ష్మణ్, భీమయ్య, గోవిదం, శశి పాల్గొన్నారు.


రాజేంద్రనగర్ బీజేపీ కార్యాలయం వద్ద..

‘హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం’


పాదయాత్ర చేస్తున్న బీజేపీ నాయకులు

శంషాబాద్: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో రాష్ట్ర సర్కారు విఫలమైందని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్ ఆరోపించారు. పట్టణంలోని 10, 11 వార్డులో ఆదివారం ఆయన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్ గుప్తా, కౌన్సిలర్ కొండ ప్రవీణ్‌గౌడ్ ఇతర నేతలతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఎంతమందికి డబుల్ బెడ్రూమ్‌లు అందజేశారో చెప్పాలన్నారు. కొన్ని సంక్షేమ పథకాలు కేవలం బీఆర్ఎస్ నేతలకు పరిమితం చేశారని ప్రస్తుతం గృహలక్ష్మీ దరఖాస్తులో కూడా బీఆర్ఎస్ నేతల పైరవీలే నడుస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. శంషాబాద్ ప్రభుత్వాసుపత్రి దుస్థితి ఇంకా ఎందుకు మారడం లేదని ప్రశ్నించారు. మౌలిక వసతులు లేక అనేక బస్తీల్లో ప్రజలు నిత్యం నరకం అనుభవిస్తున్నా పాలకులకు పట్టడం లేదన్నారు. మరోసారి ఎన్నికలకు ఏం మొహం పెట్టుకుని బీఆర్ఎస్ నేతలు ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌యాదవ్, సిద్ధు, శ్రీకాంత్, కుమార అనిల్, సుఖేందర్, రఘునందన్, హరీష్, ప్రశాంత్,గణేష్, రమేష్, శివ, రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలి


జాతీయ జెండాలతో బీజేపీ నాయకులు

గచ్చిబౌలి: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతిఒక్కరూ జాతీయ జెండాను ఇంటిపై ఎగురవేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు గజ్జెల యోగానంద్ పిలుపునిచ్చారు. ఆదివారం గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో ‘హర్ ఘర్ తిరంగా’కార్యక్రమంలో జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ భాగంగా ప్రతి భారతీయుడిలో దేశభక్తి భావాన్ని ప్రేరేపించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి భారతీయుడికి త్రివర్ణ పతాకంతో భావోద్వేగ అనుబంధం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ తెలంగాణ సెంట్రల్ కో ఆర్డినేటర్, సుప్రీంకోర్టు న్యాయవాది బాలరాజు పాల్గొన్నారు.

చురుగ్గా ఫుట్‌పాత్, సైకిల్‌ట్రాక్ పనులు


ఓఆర్ఆర్ అండర్ బ్రిడ్జి వరకు కొనసాగుతున్న పనులు

రాయదుర్గం: మోడల్ కారిడార్‌కు మరిన్ని సొబగులుదిద్దే పనులు చురుగ్గా సాగుతున్నాయి. నానక్‌రాంగూడ ఔటర్‌రింగు రోడ్డు అండర్ బ్రిడ్జి నుంచి ఖాజాగూడ, ప్రశాంత్ హిల్స్, మధురానగర్ మీదుగా దాబా కూడలి వరకున్న రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్, సైకిల్‌ట్రాక్ నిర్మాణం చేస్తున్నారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో రూ.10 కోట్ల నిధులతో ఈ నిర్మాణాలు చేస్తున్నారు. నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసేందుకు ఉన్నతాధికారులు, జోనల్ కమిషనర్, సర్కిల్ అధికారుల ఆదేశంపై సర్కిల్ ఈఈ శ్రీనివాస్, డీఈ విశాలాక్షి, ఏఈ జగదీష్ ఆధ్వర్యంలో వర్క్‌ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ పర్యవేక్షణలో ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బండ్లగూడ: హిమాయత్‌సాగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని సంబంధిత అధికారి పి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వేంకటేశ్వర కాలనీ, డైమండ్ వ్యాలీ, ప్రశాంత్‌నగర్, బృందావన్ కాలనీ, నర్సారెడ్డి కాలనీ, పద్మశ్రీహిల్స్, పావనీ హార్మనీ, పావనీ పటెల్స్, తిరుమల గార్డెన్, బండ్లగూడ, పీఅండ్‌టీ. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పీఅండ్‌టీ కాలనీ ఏ,బీ,సీ,డీ స్పెషల్ బ్లాక్, కీర్తిరిచ్‌మండ్ విల్లాస్, విద్యానగర్, వీకర్‌సెక్షన్ తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలన్నారు.

చిన్నారులకు దేశభక్తి గీతాల పోటీలు


పోటీల్లో పాల్గొన్న కాలనీవాసులు, చిన్నారులు

రాజేంద్రనగర్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఉప్పర్‌పల్లి చైతన్య విల్లాస్ కాలనీలో వివిధ పోటీలు నిర్వహించారు. చైతన్య విల్లాస్ కాలనీ రామాలయంలో చిన్నారులకు దేశభక్తి గీతాలు, క్విజ్, మ్యూజికల్ చైర్ నిర్వహించారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో కనకదుర్గ, అనురాధ, కామేశ్వరి, వనిత, సుభాష్, అనీష్, రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు స్వాతంత్య్ర దినోత్సవం రోజున బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

అథర్ షఫియాకు పీహెచ్‌డీ



రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని పరిశోధక విద్యార్థిని అథర్ షఫియాకు పీహెచ్‌డీ డిగ్రీని ఆదివారం ప్రకటించారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని మేనేజ్‌మెంట్ విభాగంలో అథర్ షఫియాకు ఈ డిగ్రీని ప్రకటించారు. ఆమె ‘క్వాలిటీ ఆఫ్ వర్క్ లైఫ్ అండ్ ఎమోషనల్ లేబర్ అమాంగ్ ఎయిర్‌హోస్టెస్‌లు: ఏ స్టడీ ఆఫ్ సెలెక్ట్ ఎయిర్‌లైన్స్ ఇన్ ఇండియా’ అనే అంశంపై పీహెచ్‌డీ థీసిస్‌ను సమర్పించారు. ఆమె మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ విభాగంలో ఫ్యాకల్టీ డాక్టర్ షేక్ కమ్రుద్దీన్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఆమెను పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

పట్టు వస్త్రాల సమర్పణ



చాంద్రాయణగుట్ట: శ్రీశైలం భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వార్లకు లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు వెంకటేష్, విష్ణుగౌడ్, మాణిక్ ప్రభుగౌడ్, రాజ్‌కుమార్‌యాదవ్, లక్ష్మీనారాయణగౌడ్, ప్రధాన కార్యదర్శి మారుతీ యాదవ్, ప్రతినిధులు వినోద్‌కుమార్, చంద్రకుమార్, శేషు నారాయణ తదితరులకు ఏఈఓ ప్రత్యేక స్వాగతం పలికారు. ఏటా బోనాల ఉత్సవాల అనంతరం శ్రీశైలం దేవస్థానం దర్శనం చేసుకోవడం ఆనవాయితీగా వస్తుందని పేర్కొన్నారు.

మైత్రి కమిటీ సేవలు అభినందనీయం

గోల్కొండ: స్థానిక పండుగలు, ఉత్సవాలు, శాంతియుతంగా జరగడంలో పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు ప్రశంసనీయమైన పాత్ర పోషిస్తున్నారని ఏసీపీలు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్ అన్నారు. ఆదివారం వారు గోల్కొండకు వచ్చిన సందర్భంగా పలువురు పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు వారిని కలిశారు. ఈ కార్యక్రమంలో షానవాజ్‌ఖాన్, షంషుద్దీన్ తదితరులున్నారు.

గోల్కొండలో పారిశుద్ధ్య పనులు

గోల్కొండ: గోల్కొండ కోటలో పంద్రాగస్టు వేడుకలను పురస్కరించుకొని బల్దియా వారు మూడు రోజుల నుంచి గోల్కొండ కోటకు వచ్చే అన్ని రహదారులను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. లంగర్‌హౌస్ నుంచి రాందేవ్‌గూడ మీదుగా కోటకు వచ్చే రోడ్డుకు ఇరువైపుల పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు వ్యర్థాలు డంపింగ్ కాకుండా అధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. అదేవిధంగా మోతీదర్వాజ వద్దగల కందకం పరిసరాలను కూడా అధికారులు శుభ్రం చేశారు. వీవీపీలు ఎక్కువగా వచ్చే బంజారా దర్వాజ పరిసరాలను కూడా భారీ ఎత్తున శుభ్రం చేస్తున్నారు. టోలిచౌకి, నానల్‌నగర్, షేక్‌పేట్ బస్టాప్ తదితర ప్రాంతాల్లోని రోడ్డు డివైడర్లలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి కొత్త పూల కుండీలను ఏర్పాటు చేస్తున్నారు.